# ఎర్రారెడ్డి పాలెం కు ఆర్టీసీ బస్సు !

**కలెక్టర్ ' పల్లెనిద్ర ' హామీ అమలు**



**ఒంగోలు, జూన్25. అక్షర టైమ్స్** : లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు అందు బాటులోకి వచ్చింది. ఈనెల 19వ తేదీన ఈ గ్రామంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఈ గ్రామంలో ' పల్లెనిద్ర ' కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ఇక్కడి నుంచి 60 మంది విద్యార్థులు తిమ్మారెడ్డిపాలెం హైస్కూలుకు వెళున్నారని, వీరి కోసం బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం బస్సు సర్వీసును అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు డిపో మేనేజర్ ఆర్. శ్రీనివాసరావు గురువారం కందుకూరు డిపోలో ఈ బస్సు సర్వీసును ప్రారంభించారు. తమ విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించి విద్యార్థుల క్షేమం కోసం బస్సు సర్వీసును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్న కలెక్టరుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# డిజిటైజేషన్ పైన మరింత దృష్టి సారించాలి

**కలెక్టర్ పి. రాజాబాబు**





**ఒంగోలు,జూన్ 25.అక్షర టైమ్స్** : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) ప్రక్రియలో డిజిటైజేషన్ పైనా మరింత దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బీ.ఎల్.వో.లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించేందుకు గురువారం ఆయన ఒంగోలు నగరంలోని కబాడీపాలెంలో పర్యటించారు. ప్రతి ఇంటికీ ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చి, ప్రజల నుంచి వివరాలను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. కాగా, జిల్లావ్యాప్తంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ 87 శాతం పూర్తయిందని, మిగిలిన ఓటర్లు అందుబాటులో లేరని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ కు తెలిపారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు బిఎల్ఏల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. పూర్తిచేసి ఇచ్చిన ఎన్యుమరేషన్ పత్రాల డిజిటైజేషన్ మాత్రం 8 శాతమే పూర్తయినట్లు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈనెల 27, 28 తేదీలలో ఈ పత్రాల డిజిటైజేషన్ పై ప్రత్యేక దృష్టిసారించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, తహసిల్దార్ కృష్ణమోహన్ , ఇతర అధికారులు ఉన్నారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక **అక్షర టైమ్స్** మా అక్షరం ప్రజల పక్షం

## ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

# కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం







**కురిచేడు,జూన్ 25.అక్షర టైమ్స్** : కురిచేడు మండలం, పోట్లపాడు గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి వారి ఆధ్వర్యంలో గురువారం కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో సమతుల్య ఎరువుల వాడకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.టి. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని జిల్లాలలో అధిక రసాయన ఎరువులు వాడుతున్న జిల్లాలో మన ప్రకాశం జిల్లా కూడా ఉంది అని అన్నారు. కాబట్టి మన రైతులు అధిక రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు , వానపాముల ఎరువులను వాడటం, భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఆధారంగా ఎరువులు వాడుకొన్నట్లైతే సాగు ఖర్చు తగ్గుతుందని తెలియజేశారు. అలాగే, ఎల్ నినో ప్రభావం వలన నైరుతి ఋతుపవనాలు మందగించి, తేలికపాటి జల్లులు, వర్షాల విరామం, ఒకే సారి పెద్ద వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడటానికి అవకాశం ఉంటుందని, ఈశాన్య ఋతు పవనాలు కూడా ఆశాజనకంగా ఉండవని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని అలాగే వేసుకునే పంటల విషయంలో కందిలో సజ్జ, జొన్న, ఆముదాలు అంతర పంటలగ వేసుకోవాలని, వరి మాగాణి భూములలో వరి కుదరని పక్షంలో రాగి, కొర్ర వేసుకోవాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ మాట్లాడుతూ యూరియా మరియు డిఏపి ఏపీ ఏఐఎంఎస్ ఆన్లైన్ వ్యవస్థ ద్వారా రైతు తాను సాగు చేసేటటువంటి పంటకు శాస్త్రవేత్తలు సూచించిన మోతాదును బట్టి రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానంలో కౌలు రైతులు, ఎండోమెంట్ భూముల్లో సాగు చేసే రైతులు, అలాగే వెబ్ల్యాండ్లో నమోదు కాని ఇతర భూముల్లో పంటలు సాగు చేసే రైతులకు కూడా పంట ఆధారంగా శాస్త్రవేత్తలు సూచించిన మోతాదుల ప్రకారం ఎరువులు అందజేయబడతాయని తెలిపారు. అందువల్ల రైతులందరూ తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, జాబితాలో తమ పేరు ఉందో లేదో, తమకు సంబంధించిన అన్ని సర్వే నంబర్లు మరియు విస్తీర్ణ వివరాలు సరిగా నమోదయ్యాయో లేదో, అలాగే ఈ ఖరీఫ్ సీజన్లో సాగు చేయనున్న పంట వివరాలు సరిగ్గా నమోదు అయ్యాయో లేదో ధృవీకరించుకోవాల్సిందిగా సూచించారు. ఏదైనా సర్వే నంబర్, పేరు లేదా విస్తీర్ణం నమోదు కాకపోయినా లేదా తక్కువగా నమోదై ఉన్నా, సంబంధిత రైతు సేవా కేంద్రంలో తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించబడినట్లు తెలిపారు. కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ, గ్రామ పెద్దలు,రైతులు పాల్గొన్నారు.

# ఎల్ వో సి చెక్కులను పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



**దర్శి,జూన్ 25.అక్షర టైమ్స్** : దర్శి లోని టిడిపి కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఎల్ ఓ సి లు ఇద్దరికీ , దర్శి టౌన్ వాస్తవ్యులు మారాబత్తిని అంకమ్మ కి 1,53,339 రూపాయలు, ముండ్లమూరు మండలం, కెల్లంపల్లి గ్రామ వాస్తవ్యులు గోళ్ళపాటి ప్రమీల రాణి కి - 1,72,419 రూపాయలు మొత్తం : రూ. 3,25,758 రూపాయల ఎల్ వో సి లను గురువారం లబ్ధిదారులకు దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అందజేసినారు. లక్ష్మి తో పాటు దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు, ముండ్లమూరు మండల మాజీ జడ్పీటీసీ కొక్కెర నాగరాజు ఉన్నారు.

# శ్రీ పట్టాభి రామస్వామి ధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి,జూన్ 25.అక్షర టైమ్స్** : తాళ్లూరు మండలం, బొద్ధి కూరపాడు గ్రామపంచాయతీ, చింతలపాలెం గ్రామం నందు గురువారం శ్రీ పట్టాభి రామస్వామి, సీత లక్ష్మణ, హనుమంతు స్వామి వార్ల ధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం లో దర్శి టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందినారు. వారితో పాటు తాళ్లూరు మండల టిడిపి అధ్యక్షులు మేడగం వెంకటేశ్వర రెడ్డి, లేళ్ళ వెంకయ్య, హరిబాబు, సూరారెడ్డి గ్రామ టిడిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# పోడు సాగు పేరుతో రిజర్వ్ ఫారెస్ట్‌లో భారీ వృక్షాల నరికివేత

**అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆరోపణలు**





**కుక్కునూరు,జూన్25.అక్షర టైమ్స్** : ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలోని రుద్రంకోట బీట్‌లో రిజర్వ్ ఫారెస్ట్ భూముల ఆక్రమణలు వస్తున్నాయి భారీ వృక్షాల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పోడు సాగు పేరుతో కొందరు ఆక్రమణదారులు ఏళ్ల తరబడి అటవీ భూములను ఆక్రమించుకుంటూ సాగు విస్తీర్ణాన్ని పెంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం 20 ఎకరాలకు పైగా అటవీ భూమిలో పోడు సాగు జరుగుతుండగా, అక్కడ ఉన్న టేకు, సిరమాను, మద్ది తదితర విలువైన భారీ వృక్షాలను యంత్రాల సహాయంతో నరికి తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని చెబుతున్నారు. అయినప్పటికీ స్థానిక అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాజకీయ అండదండలతో కొందరు వ్యక్తులు రిజర్వ్ ఫారెస్ట్ భూములను కబ్జా చేస్తున్నప్పటికీ, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకుండా కార్యాలయాలకే పరిమితమవడంతో అటవీ భూముల ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమాలపై సమాచారం అందించిన వారినే ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసిన వ్యక్తుల వివరాలను అక్రమాలకు పాల్పడుతున్న వారికి చేరవేస్తున్నారని, దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు.రిజర్వ్ ఫారెస్ట్‌లో వందలాది భారీ వృక్షాలు నేలకూలుతున్నా అటవీశాఖ స్పందించకపోవడం పర్యావరణవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. కోట్లాది రూపాయల విలువైన అటవీ సంపద నాశనమవుతున్న నేపథ్యంలో జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి, విధుల్లో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అటవీ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నిశ్చితార్థ వేడుకలలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులు**



**దర్శి,జూన్ 25.అక్షర టైమ్స్** : ఒంగోలు పట్టణంలోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ మేనల్లుడు, జీజే రవీంద్రనాథ్ - మాధవి ల కుమారుని నిశ్చితార్థ వేడుకలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ , ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి , ఏపీ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య , సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్ , గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి , చీరాల శాసనసభ్యులు ఎం.ఎం. కొండయ్య, ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తదితర ప్రజా ప్రతినిధులు హాజరైనారు.

# ఘనంగా ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట యోధుల సన్మానం





**కావలి,జూన్25.అక్షర టైమ్స్** : భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయమైన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి నేటికి 51 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కావలి పట్టణంలో ఎమర్జెన్సీ యోధులను ఘనంగా సన్మానించారు. భారతీయ జనతా పార్టీ కావలి ఒకటో పట్టణ శాఖ ఆధ్వర్యంలో, పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన ఈ గౌరవ సత్కార కార్యక్రమం గురువారం నిర్వహించబడింది. నాటి నల్లటి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, పౌర హక్కుల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయక పోరాడిన స్థానిక యోధులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఆనాటి ఎమర్జెన్సీ కాలంలో చురుగ్గా పాల్గొని, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన స్థానిక పోరాట యోధులు కూరపాటి నారాయణ రెడ్డి, ఎండ్లూరి రంగనాథ్ సింగ్ లను నిర్వాహకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారికి భరతమాత చిత్రపటాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు భావోద్వేగానికి లోనవుతూ తమ జీవితంలో దేశం కోసం చేసిన ఆ పోరాటం ఎప్పటికీ మరువలేనిదని, ఈ రోజున తమను గుర్తుంచుకొని గౌరవించినందుకు నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమ ంలో పాల్గొన్న ముఖ్య నాయకులు మాట్లాడుతూ, 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ దేశ రాజ్యాంగ స్ఫూర్తిని, పౌరుల ప్రాథమిక స్వేచ్ఛను పూర్తిగా హరించివేసిందని గుర్తుచేశారు. నాటి పాలకుల అణచివేతకు, పోలీసుల లాఠీ దెబ్బలకు భయపడకుండా, జైలు శిక్షలను భరిస్తూ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదుల త్యాగాలు అమూల్యమైనవని కొనియాడారు. నేటి యువతకు నాటి చీకటి రోజులను, ప్రజాస్వామ్యం యొక్క విలువను వివరించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్ కుమార్, జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జిల్లా కోశాధికారి సి వి సి సత్యం, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పాతపాటి వెంకటరమణారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సిద్ధి జయ ప్రతాప్ రెడ్డి, కో ఆపరేటివ్ సెల్ జిల్లా కన్వీనర్ కునపరెడ్డి శ్రీనివాసులు, జలదంకి ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు యాదవ్, పట్టణ కార్యదర్శి మట్టా మల్లికార్జున, అన్నంగి సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

**ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి**

**విద్యార్థుల్లో డ్రగ్స్,మద్యం దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని పిలుపు**



**ఏలేశ్వరం,జూన్25.అక్షర టైమ్స్** : కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలన,అక్రమ రవాణా నిరోధంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు.అనంతరం “నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్ కి పహచాన్” పోస్టర్‌ను ఆవిష్కరించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.సిగరెట్లు, బీడీలు,గుట్కా,మద్యం వంటి వ్యసనాలకు యువత బానిసలు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.యువత దేశ భవిష్యత్తుకు పునాది కావడంతో, వారిని చెడు వ్యసనాల బారిన పడకుండా అప్రమత్తం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు.

# రాయలసీమ ఎత్తిపోతల పథకం నకు వైయస్సార్ ఎంతగానో కృషి చేశారు

**వై.ఎస్.ఆర్ ఆశయాల కోసం జగన్మోహన్ రెడ్డి అడుగులు**

**నేడు రైతులను ఈ ప్రభుత్వం గాలికి వదిలేసింది**

**కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి**





**నెల్లూరు,జూన్25.అక్షర టైమ్స్** : రాయలసీమ ఎత్తిపోతల పథకానికి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంతగానో కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ఆయన తనయుడు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగులు వేస్తూ రైతులకు అండగా ఉంటూ ముందుకు సాగు తున్నారని కావాలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలే సింది అని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధనే లక్ష్యంగా నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సోమశిల ప్రాజెక్టును పార్టీ ముఖ్య నాయకులు సందర్శించారు. వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన ముఖ్య నాయకులతో కలిసి పాల్గొని ప్రసంగించారు.వైఎస్ జగన్ పాలనలోనే రైతు సంక్షేమం జరిగిందన్నారు.ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఆనాటి మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను అనుసరించి, వారి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం,'రైతు భరోసా'ను సకాలంలో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుండేవారని కొనియాడారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పట్టించుకోకుండా, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా కూటమి నాయకులు కాలయాపన చేస్తూ రైతుల పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శిస్తుంది. అదేవిధంగాకూటమి ప్రభుత్వ పెద్దల అండదండలతో వారి అనుచర గణం రైతులకు సకాలంలో యూరియా నిల్వలు అందకుండా చేసి వాటిని బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటూ రైతులకు అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు.“రైతుల సంక్షేమం కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో సాగునీరు, గిట్టుబాటు ధరలు కల్పించకపోయినా, ఎన్నికల హామీ మేరకు రైతు భరోసా అందించకపోయినా వైఎస్సార్సీపీ రైతుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంది అని రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల హక్కుల కోసం కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పార్టీ శ్రేణులు, రైతులు సిద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

